**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

# తెలుగు శతక సాహిత్యం మానవీయ విలువలు

**-డా||. బూసి వెంకటస్వామి.** **- డా||. పెండ్యాల లావణ్య**
శాఖాధిపతి, తెలుగు విభాగం. తెలుగు అధ్యాపకురాలు
శ్రీ ఏ.యస్.యన్ యం ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), ప్రభుత్వ డిగ్రీ కాలేజి, రాజోలు,
పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా. డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

సంస్కృతం నుండి తెలుగు సాహిత్యంలోకి అడుగిడిన ప్రక్రియ శతకం. తెలుగు సాహిత్య చరిత్రలో శతక ప్రక్రియలు సమాజ రుగ్మతలను సరిచేసే చైతన్య స్రవంతులు. శతక సాహిత్యం కవిత్వం మాత్రమే కాదు. మానవ జీవన సంహిత వేదోపనిషత్తుల సారాన్ని సరళమైన పద్యాలతో లోకానికి అందించడమే శతక సాహిత్య పరమార్థం. శతక సాహిత్యం సామాజిక నైతిక విలువల్ని తెలియజేస్తాయి. శతకాలు మనిషి నైతిక ప్రవర్తనను నిర్దేశిస్తాయి. సమాజానికి మానవతా విలువలకి అవినాభావ సంబంధముంది. ఎంత ఉన్నత విద్యను అభ్యసించినప్పటి నేటి యువత మానవతా విలువల్ని గ్రహించలేకపోతున్నారు. పెద్దలను గౌరవించడం, ఇతరులతో సఖ్యతగా మెలగడం, సమాజం పట్ల బాధ్యతాయుగంగా ప్రవర్తించటం లేదు. మనిషికి చదువు వలన జ్ఞానం ఎలా వస్తుందో అలాగే విచక్షణా లక్షణాలు కూడా వాటంతటవే అలవడతాయి.

మనిషి తన జీవన గమనంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే చదువు ఎంత ప్రముఖపాత్ర పోసిస్తుందో లోకజ్ఞానం కూడా అంతే పాత్ర పోషిస్తుంది. ఎంత చదువుకున్నా, లోకజ్ఞానం లేకపోతే వాడు మనిషే కాడు. చిన్నతనం నుండే శతక పద్యాలను పిల్లల చేత చదివించడం వలన వారిలో నైతిక విలువలు పెరిగి కుటుంబం పట్ల, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తాడు. మొక్కై వంగనిది మానై వంగునా అనే సామెత పిల్లల జ్ఞానబోధనలో అక్షర సత్యం. కాబట్టి నేటి తరానికి శతక సాహిత్యపు గుభాళింపు పరిమళింపజేస్తే సమాజంలో జరిగే నేరాలను అరికట్టినవాళ్ళమౌతాము. నేటి సమాజంలో ఎన్నో ఎన్నో అరచకాలు జరుగుతున్నాయి. తండ్రి కూతురి పట్ల అసభ్యంగా

ప్రవర్తించాడని, కన్నపిల్లలే తల్లిదండ్రులను చూడలేక బలవంతంగా వృద్ధాశ్రమాలలో చేర్పించడం, రక్త సంబంధీకులై ఆస్తికోసం, అధికారంకోసం ప్రాణాలు తీసుకోవటం ఇవన్నీ నేటి సమాజంలో రాణిస్తున్నాయంటే నైతిక విలువలు కొరవడడమే ప్రధాన కారణం. మనిషి భౌతికంగా నైతిక విలువల్ని అలవర్చుకోవాలి ఎప్పుడైతే నైతికంగా మనగలగుతాడో అప్పుడు మానవీయ విలువలు పరిపుష్ఠమౌతాయి.

**శతక సాహిత్య లక్షణాలు- మానవీయ విలువలు :** శతకానికి సంఖ్యానియమం, మకుట నియమం, ముక్తకం, ఛందోనియమం మొదలగు ప్రాథమిక లక్షణాలున్నాయి. శతక పద్యాలలో దేనికదే స్వతంత్ర భావాన్ని కలిగి ఉంటాయి. శతకకారులు సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించి మనుషులు ఎలా జీవించాలో మార్గనిర్దేశం చేశారు. మనిషి దశదిశను నిర్దేశించే శతకాలను శతకారులు రచించారు. సమతీ శతకం- బద్దెన, వేమన శతకం వేమన, భాస్కర శతకం మాదర వెంకయ్య, శ్రీకాళహస్తీశ్వర శతకం ధూర్జటి, దాశరథీ శతకం కంచెర్ల గోపన్న, సుభాషిత రత్నావళి ఏనుగుల లక్షణకవి భూషలుగావు మర్త్యులకు భూరిమ యాంగద తారాహారముల్ భూషిత కేశపాశ మృదుపుష్ప సుగంధ జలాభిషేకముల్ భూషలుగావు, పూరుషుని భూషితుజేయు బవిత్రవాణి; వాగ్భూషణమే సుభూషణము, భూషణముల్ నశియించు నన్నియున్

మనిషికి మంచిమాటే అలంకారం. శరీరానికి చేసుకునే భౌతిక అలంకారాల వలన మనిషి గుర్తించబడడు. మనిషి సంస్కారవంతమైన మాటలతోనే గుర్తించబడతాడు. అతడు వేసుకున్న నూతన వస్త్రాల ద్వారా కాని, నగల ద్వారా గాని గుర్తించబడరు. అతడు పలికే మంచి మాటవలనే గొప్పవ్యక్తిగా గుర్తించబడతారని ఏనుగు లకꣳణకవి ఉద్బోదించాడు. నేటి యువతకు ఈ పద్యం మైలురాయి. నేటి యువత ఎదుటివారిని ఆకర్షించే విధంగా ఎలా మాట్లాడో ఈ పద్యం తెలియజేస్తుంది. ఆహార్యం కన్నా మాటతీరు మనల్ని ఉన్నతంగా నిలిచేలా చేస్తుంది. యువత ఉద్యోగాల నిమిత్తం చేసే ఇంటర్వ్యూలలో ఎదుటివారిని మాటతీరుతో ఆకర్షించవచ్చు. ఆ ఆకర్షణ మనిషి నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. మనిషికి విద్య, అతని నోటినుండి వచ్చే సంస్కారవంతమైన మాట వలన గౌరవం పెరుగుతుంది.

నేటి యువతకు భవిష్యత్ ప్రణాళికపై అవగాహన లేకపోగా చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. కష్టపడి చదివితే ఇష్టమైన జీవితం లభిస్తుందని

**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

తెలుసుకోలేకపోతున్నారు. మొబైల్ ఫోన్కే తమ జీవితాల్ని అంకితం చేస్తున్నారు. ఫోన్స్ కారణంగా యువత పక్కదారి పడుతున్నారు. వారి వయసుకు మించి పనులు చేస్తూ తమ జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారు. చదువుకుంటే / జ్ఞానం ఆలోచనాశక్తి పెరుగుతుంది. ఆలోచనల వలన ఏది మంచి ఏది చెడు అని ఆలోచించగలుగుతాడు. అందుకే 17వ శతాబ్దంలోనే ఏనుగు లక్ష్మణకవి చదువు ఆవశ్యకతను తెలియజేశారు.

"విద్య నిగూఢ గుప్తమగు విత్తము రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశ బంధుడున్
విద్య విశిష్ట దైవతము విద్యకు సాటిధనంబు లేదిలన్
విద్య నృపాల పూజితము, విద్యనెఱుంగనివాడు మర్త్యుడే"

విద్య నిధితో సమానం. అది రహస్యంగా దాచుకున్న ధనంలాంటిది. విద్య వలన మనకి గౌరవ మర్యాదలు లభిస్తాయి. చదువు వలన మనిషి అందం పెరుగుతుంది. విద్య గురువుతో సమానం విద్య దైవంతో సమానం. చదువుకున్న వారికి అన్నిచోట్ల గౌరవం లభిస్తుంది. చదువులేనివాడు పశువుతో సమానం. మనిషి జీవితం గొప్పగా ఉండాలంటే చదువే సరైన మార్గమని, బాగా చదువుకుంటే దేశవిదేశాలలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడ చదువు ఒక్కటి ఉంటే చాలు మిగతా ఆస్తులు, అంతస్తులు అవసరం లేదు. చదువే విలువైన ఆస్తితో సమానం. పిల్లలకి ఆస్తులు, అంతస్తులు ఇచ్చేకంటే చదువుని అందిస్తే వాళ్ళే తమ కాళ్ళపై నిలబడి అన్ని సంపాదించుకుంటారు. చదువుకోవటం వలన వినయవిధేయతలు పెరుగుతాయి. పెద్దల పట్ల గౌరవం పెరుగుతుందని ఏనుగు లకꣳణకవి గారు పేర్కొన్నారు. ఇమ్మిగ జదువని నోరును నమ్మాయని పిలిచి యన్నమడుగని నోరున్ తమ్ముల బిలువని నోరును గుమ్మరి మను ద్రవ్వినట్టి గుంటర సుమతీ!

మనిషి సంఘజీవి. సంఘ నియమావళిని అనుసరించి కుటుంబం పట్ల బాధ్యతగా వ్యవహరించేవాడే జ్ఞాని అని పేర్కొన్నారు. కన్న తల్లిని అమ్మా అని పిలిచి అన్నం పెట్టమని అడగని నోరు, అన్నదమ్ములను ఆప్యాయంగా చూడని నోరు, చక్కగా చదువుకోని నోరుని కుమ్మరివాడు కుండలు తయారు చేయటానికి మట్టిని త్రవ్వగా ఏర్పడిన గొయ్యితో సమానమని పేర్కొన్నారు.

మనిషి కుటుంబ బంధాలపట్ల బాధ్యతతో వ్యవహరించాలి. కన్న తల్లిదండ్రులను, తోడబుట్టిన వారిని ప్రేమగా ఆదరించాలి. చక్కగా

చదువుకోవాలి. ఎంతమంచిగా చదువుకుంటే మనిషి అంత జ్ఞానాన్ని సంపాదించుకుని కుటుంబం పట్ల, తోబుట్టువులు, బంధువులపట్ల జ్ఞానాన్ని సంపాదించుకుని కుటుంబం పట్ల, తోబుట్టువులు, బంధువుల పట్ల అంతే ఆదరాభిమానాలు పొందగలగుతాడు. అలా లేనప్పుడు కుమ్మరివాడు. కుండల తయారీకి మట్టిని భూమిలో గుంతతీసి మరీ సేకరించి ఆ గొయ్యిని అలాగే వదిలేస్తాడు. అలా వదిలేసిన గొయ్యి చాలా ప్రమాదకరం. అందుకే బద్దెన నోరుమంచిగా లోకపోతే మనిషి కుమ్మరివాడు తీసిన గొయ్యితో సమానమని తెలియజేశారు.

“ఉపకారికి నుపకారము
విపరీతము కాదుసేయ
వివరింపంగా నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ!”

ఇతరులు ఎవరైనా సహాయం కోరినప్పుడు మనం వారికి సహాయం చేస్తాము. మళ్ళీ మనకు అవసరం వచ్చినప్పుడు వారు తిరిగి సహాయం చేస్తారు ఇందులో పెద్ద విశేషమేమీ లేదు. ఎందుకంటే ఇది అందరు చేసేదే. మనకు సహాయం చేసిన వారి రుణం తీర్చుకోవటం కోసం ఇలా చేస్తాము. అలా కాకుండా మనకు ఎవరో ఒకరు అపకారం చేసినవారుంటారు. వారికి ఎప్పుడో ఒకప్పుడు మన అవసరం వస్తుంది. అలాంటప్పుడు మనం వారు చేసిన తప్పును ఎత్తిచూపుతూ వారికి సహాయం చేయకుండా ఉండకూడదు. వారు తెలియక చేశారులే అని మంచి మనసుతో భావించి, ఆపదలో ఉన్నప్పుడు తప్పకుండా సహాయం చేయాలి. అటువంటివారే నేర్పరులవుతారని బద్దెన తెలియజేశారు.

నేటి సమాజంలోని విపరీత ధోరణులకు శతకాలే సమాధానమవ్వాలని డిగ్రీస్థాయిలో శతక సాహిత్యాన్ని ఆణిముత్యాలుగా పాఠ్య నిర్ణాయక మండలి వారు ప్రవేశపెట్టారు. ఇందులో విద్యార్థిని విద్యార్థులు ఆణిముత్యాల్లాంటి శతక పద్యాలనున చదివి తమ జీవన గమనాన్ని మార్చుకునే విధంగా ఏనుగు లకణ కవి 'సుభాషిత రత్నావళి' పద్యాలను పొందుపరిచారు. విద్య యొక్క ఆవశ్యకతను, మాట యొక్క విలువను ఏనుగు లక్ష్మణకవి సుభాషిత రత్నావళిలో పేర్కొన్నారు. సంస్కృతంలో భర్తృహరి రచించిన 'సుభాషిత త్రిశతిని', 'సుభాషిత రత్నావళి'గా ఏనుగు లకeణకవి తెలుగులోకి అనువదించాడు.

సుభాషిత రత్నావళిలో యువతకు అవసరమైన వ్యక్తిత్వ వికాసాంశాలు, మానవ ప్రవర్తన, విచక్షణాజ్ఞానాలు పొందుపరిచారు..

"దానములను సేయదరచేతులాడక
బహు ధనంబు గూర్చి
పాతి పెట్టి తుదను దండుగనిడి
మొదలుచెడు నరుడు విశ్వదాభిరామ వినురవేమ"

మనిషి ధనాశతో విపరీతంగా సంపాదిస్తాడు. సంపాదించిన తన సొమ్ము తాను తినక ఇతరులకు పెట్టకుండా కూడబెడతాడు. తన కడుపుకి తినకుండా కూడబెట్టిన సొమ్మును పెరట్లోని రహస్య ప్రాంతంలోనో దాచి పెడతాడు. అలా దాచిన సొమ్ము పరులపాలౌతుంది. అదే సంపాదించిన సొమ్ములో కొంత పేదవారికిచ్చిన పుణ్యం లభిస్తుంది. లోభివాని సొమ్ము సొమ్ములో కొంత పేదవారికిచ్చిన పుణ్యం లభిస్తుంది. లోభివాని సొమ్ము రాజులపాలు అని ఊరకనే అనలేదు. వేమన దాన గుణం గురించి పేర్కొన్నారు. మనం సంపాదించే సంపదలో ఒక వంతు దానం చేయటం వలన చనిపోయిన తర్వాత కూడా లోకులచేత కొనియాడబడతామని పేర్కొన్నాడు. వేమన మనిషికి సంపాదన ఎంత ముఖ్యమో దాన గుణం కూడా అంతే ముఖ్యమని శతకాల ద్వారా తెలియజేశారు.

మనసులోన నున్న మమతలన్నియు
గోసి దృడము చేసి మనసు
తేట పరచి ఘటము నిల్పువాడు
ఘనతర యోగిరా విశ్వదాభిరామ వినుర వేమ!

మనుసులోని అహంకారాన్ని తొలగించుకోవాలి. మనసును స్థిరపరచుకోవాలి శుభ్రపరచుకోవాలి. మనుసును పరిశుభ్రంగా ఉంచుకుని దేహాన్ని అదుపు చేసుకోగలగినవాడే నిజమైన యోగి అవుతాడని వేమన పేర్కొన్నాడు. మనిషి అహంకారంతో ఉండకూడదు. ఎప్పుడైతే అహంకారంతో ఉంటాడో అతని విలువ తగ్గిపోతుంది. అటు సమాజంలోను ఇటు కుటుంబంలోను విలువ తగ్గిపోతుంది. ఎప్పుడైతే మనిషి అహంకారాన్ని విడిచి ప్రశాంతంగా ఉంటాడో అప్పుడే అన్ని విషయాలలోను అతడు విజయం సాధించినట్లేనని వేమన పేర్కొన్నారు.

లావుగలవానికంటెను భావింపగ

నీతిపరుడు బలవంతుండౌ
గ్రావంబంత గజంబును మావటి
వాడెక్కినట్లు మహిలో సుమతీ!

బద్దెన శరీర బలంకంటే బుద్ధిబలం శ్రేష్ఠమైందన్నాడు. కండలు తిరిగిన శరీరాలకంటే తెలివితేటలున్న మనిషే శక్తిమంతుడు. మనిషి బుద్ధిబలంతోనే ఎంతటి ఆపదనైనా సునాయాసంగా పరిష్కరించగలడు. తెలివితేటలు లేనివాడు ఎంత కండలు పెంచినా ఉపయోగం లేదన్నాడు. ఏనుగు కొండంత ఉంటుంది. మావటివాడు ఏనుగులో సగం కూడా ఉండడు. అటువంటి మావటి వాడు తన చేతిలోని అంకుశం (చిన్నకత్తి)తో ఏనుగు కుంభస్థలాన్ని పట్టి అదుపుచేస్తాడు. ఏనుగు మావటివాడు ఎలా చెప్తే అలా నడుచుకుంటుంది. ఇక్కడ కొండంత సమస్యనైనా బుద్ధిబలంతో పరిష్కరించాలని బద్దెన చక్కగా తెలియజేశారు.

కుటుంబ వ్యవస్థలోని భవబంధాలను ఆప్యాయతానురాగాలను తెలియజేస్తూ చదువు వలన కలిగే జ్ఞానాన్ని బద్దెన.

"ఉప్పుకప్పురంబు నొక్క పోలికనుండు
చూడచూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్య పురుషులు
వేరయా విశ్వదాభిరామా వినురవేమా"

ఉప్పు, కర్పూరం ఒకేరకంగా ఉన్నా వాటి మధ్య వ్యత్యాసముంది. అలాగే మనుషులందరు ఒకేలా ఉన్నా మంచి మనుషులు వేరుగా ఉంటారని వేమన పేర్కొన్నారు. ఉప్పుకి వాసన ఉండదు, కర్పూరానికి వాసన ఉంటుంది. వాసన మూలంగా వ్యత్యాసాన్ని కనిపెట్టవచ్చు. అన్నం ఉడికిందో లేదో తెలియాలంటే అన్నం మొత్తం పట్టుకుని చూడాల్సిన అవసరం లేదు. ఒక్క మెతుకు పట్టుకుంటే చాలు తెలుస్తుంది. అలాగే ఉప్పుకప్పురంబు పద్యం ద్వారా వేమన నిశిత బుద్ధి తెలుస్తుంది.

వినదగునెవ్వరు చెప్పిన
వినినంతనే వేగపడక
వివరింపదగున్ కనికల్ల నిజము తెలిసిన
మనుశ్రీనజుడే నీతిపరుడు మహిలో సుమతీ!

ఎవరైనా ఎప్పుడైనా ఏదైనా విషయాన్ని చెప్పినప్పుడు ముందుగా విషయాన్ని శ్రద్ధగా వినాలి. ఎదుటివాళ్ళని ఏమి తెలియదని అనుకోకూడదు. విన్న తర్వాత తొందరపడి ఆ విషయం మీద ఒక నిర్ణయానికి రాకూడదు. వారు చెప్పిన విషయంలో నిజనిజాలు తెలుసుకోవాలి. ఎవరైతే అలా తెలుసుకుంటారో వారినే సమాజం నీతిపరులుగా భావిస్తుంది. బద్ధైన తొందరపాటు తనం ఉండకూడదని, మనిషి ఆవేశంతో కాక ఆలోచించి మాట్లాడాలని తెలియజేశారు.

చదువది యెంత గల్గిన సరజ్ఞత యించుక చాలకున్న
నా చదువు నిరర్థకంబు గుణసంతయుతులు మెచ్చరెచ్చటం
బదునుగ మంచికూర నలపాకము చేసిననైన నందునిం
పొద వెడునుప్పు లేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా!

మారద వెంకన్న భాస్కర శతకంలో చదువు గొప్పతనాన్ని చక్కగా వివరించారు. మనిషి ఎంత విద్యావంతుడైనప్పటికీ విద్యలోని సారాన్ని ఆవగింజంతైనా గ్రహించకపోతే అటువంటి విద్య పనికిరాదు. ఆ విద్యను పండితులెవ్వరు మెచ్చుకోరని పేర్కొన్నారు. నలభీమపాకం లాగా వంట చేసినప్పటికి అందులో ఉప్పు లేకపోతే ఆ కూరకు రుచిరాదు. చూసే పని సక్రమంగా ఉండాలి అప్పుడే దానికి పండితులు, మేధావుల నుండి గుర్తింపు లభిస్తుంది. కష్టపడితేనే లాభం చేకూరుతుంది. మొక్కుబడిగ చేయటం వలన దానికి గుర్తింపు రాదు సరికదా అబాసుపాలౌతారని భాస్కర శతకకర్త పేర్కొన్నారు. మారద వెంకయ్య చేసే పనిలో నిబద్ధత ఉండాలని మనస్ఫూర్తిగా ఏ పనిచేసినా అది విజయవంతమౌతుందని పనిలో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కార్యదక్షతతో పాటు కృషి పట్టుదల ఉండాలనే నైతిక విలువల్ని భాస్కర శతకంలో పేర్కొన్నారు.

మొదలైనవారు ప్రసిద్ధ శతకకారులు. వీరు తెలుగు సాహిత్యంలోని శతక సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. శతకాల ద్వారా మనుషుల ప్రవర్తనను, తోటి మనుషుల పట్ల సోదర భావాన్ని కలిగిఉండడం, పెద్దలపట్ల వినయ విధేయతలు కలిగి ఉండడం, కులవ్యవస్థపై నేడు, అందరు సమానమనే భావనను కలిగించాయి.

తెలుగు సాహిత్య ప్రక్రియలలో సామాన్య ప్రజలు కూడా చదివి అర్థం చేసుకోవటానికి వీలుగా శతక కారులు శతకాలను రచించారు. ఎంతో లోతైన

భావాలను వాడుక భాషలోని పదాలలో చెప్పించి సామాన్య మానవుడిని జ్ఞానిని చేయగలిగేవి శతకాలు. సమాజానికి నీతిని ప్రబోధించి జ్ఞానాన్ని కలిగించేవి శతకాలు.

మానవ గమనం ధర్మార్థ కామ మోక్షాలనే పురుషార్థాల చుట్టూ తిరుగుతుంది. శతక సాహిత్యం పురుషార్థాలను సమన్వయం చేస్తుంది. సంప్రదాయ పాదంలోని డొల్లతనాన్ని ప్రశ్నిస్తూ వాస్తవిక జ్ఞానానందిస్తాయి. వైదికధర్మం ప్రకారం మనకు నాలుగు యుగాలలో ధర్మం ఒక్కొక్క యుగాలలో పరిణామం చెందుతూ క్షీణదశకు చేరింది. కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలపై నిలిచింది. మనుషులు ఒకరినొకరు గౌరవించుకుంటూ పేదవారిపట్ల భూతదయను కలిగి ఉండేవారు. అతిధి అభ్యాగతుల్ని గౌరవించేవారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉండేది. కుటుంబ సభ్యులు కుటుంబంలోని బంధాలు అనుబంధాలకు కట్టుబడి ఉమ్మడిగా జీవించేవారు. ప్రకృతి కూడా నాటి ప్రజల స్థితిగతులకు సహకరించి మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లింది. నాటి సమాజంలో వర్ణాశ్రమ ధర్మాలున్నా అవి ఒక మనిషి నుండి మరొక మనిషిని దూరం పెట్టే స్థాయిలో లేకుండా అందరు సమానమే అనే భావనతో నిలిచాయి. ఎవరైనా ఆపదలో ఉన్నా తమకే ఆపద సంభవించినట్లు భావించి ఒకరినొకరు సహాయసహకారాలందించుకున్నారు.

త్రేతా, ద్వాపర, కలి యుగాలలో ధర్మం తన ఉనికిని కోల్పోయింది. నేటి సమాజంలో ఇతరుల పట్లదయ చూపించటం తరువాతి విషయం రక్త సంబంధీకులలోనే ఐక్యత లోపించింది. అధికారం కోసమో, ఆస్థి కోసమో ఒకరినొకరు చంపుకుంటున్నారు. ఇటువంటి విషమ పరిస్థితులలో శతక సాహిత్యం మనుషుల్లో మార్పుకు బీజం వేసింది. శతకాలు మనిషి ఎలా జీవించాలి, సమాజంలో ఎలా మెలగాలి ధర్మానిన పాటించి ఎలా నడుచుకోవాలో తెలియజేస్తాయి. వ్యక్తి తన కర్తవ్యాలను నిజాయితీగా నిర్వర్తించడం, న్యాయంగా, ధర్మబద్ధంగా ఏ విధంగా బతకాలో నేర్పింది. సత్యం, కరుణ, దయ, త్యాగం, సహనం, క్షమ సమానత్వ భావ, కుటుంబ విలువలు లోకనిగ్రహం మొదలగు అంశాల సమాహారమే శతకం.

శతక సాహిత్యానికి ఉన్న గొప్ప లక్షణం జీవితాన్ని, బతకాలనే విధి విధానాన్ని సరళంగా వ్యవహార శైలిలో శతకకారులు తెలియజేశారు. వీరి ముందుచూపు కారణంగా శతకాల్లో చెప్పిన విషయాలు నైతిక, నీతి, మానవీయ

సూత్రాలు అన్ని కాలాలకు వర్తింపజేసేవిగా ఉన్నాయి. శతకాలు 12వ శతాబ్దంలో రాయబడిన నేటి కాలానికి పరిస్థితులకు అనుకూలంగా శతకకారులు ముందే ఊహించి రాశారు. శతకంలోని పద్యాలు ముక్తకాలు. అంటే ఏ పద్యానికి ఆ పద్యమే తప్ప మరొక పద్యానికి సంబంధం ఉండదు. శతకాల్లో కవులు తమ అనుభవాలను, అభిప్రాయాలను, తప్పులను, కోరికలను, మంచిని, నీతిని తెలియజేస్తూ జీవన గమనాన్ని నిర్దేశించాయి. వంద పద్యాల ద్వారా జీవన సత్యాలు, ధర్మబోధ, మానవీయ విలువలను సూటిగా చెప్పటమే శతకాల ప్రత్యేకత. శతకాలలో సత్యానికి ప్రథమస్థానమివ్వబడింది. అబద్ధం తాత్కాలిక లాభాన్నిచ్చినా, సత్యమే శాశ్వత గౌరవాన్నిస్తాయని పేర్కొన్నారు.

శతకాలు అనగానే ప్రతి తెలుగువాడి నాలుకపై నర్తించే పేరు వేమన. గడపలు లేని ఇళ్ళు ఉండవచ్చు కాని వేమన పద్యాలు తెలియని ఇళ్ళు లేవంటే అది అతిశయోక్తి కాదు.

కార్యదక్షత గురించి ఏనుగు లక్ష్మణ కవి..

"ఆరంభింపు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై
యారంభించి బరిత్యజింతురు విఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్న నిహన్య మాన్యులగుచున్ ధృత్యన్నతోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ, ప్రజ్ఞానిధుల్ గావునన్"

మనుషులు మూడు రకాలుగా ఉంటారు. ఉత్తములు, మధ్యములు, అధములు.

**1. అధములు :** ఏ పని ప్రారంభించరు. ఎందుకంటే ఏ పని ప్రారంభించాలన్నా ముందుగా లాభనష్టాలను బేరీజు వేసుకుంటారు. ఏదైనా నష్టం జరుగుతుందని తెలిస్తే వెంటనే ఆ పనిని ముట్టుకోకుండా ఆపేస్తారు. వీరు ఎందుకు పనికిరారు.

**2. మధ్యములు :** వీరు పనిని ప్రారంభించి ఏ చిన్న కష్టంవచ్చినా ఆ పనిని పూర్తిగా వదిలేస్తారు. వీరు క కూడా ఎందుకు పనికిరారు.

**3. ఉత్తములు :** పని ప్రారంభించి ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని పనిని పూర్తి చేస్తారు. వారే ఉత్తములుగా సమాజంలో గౌరవింపబడతారు.

సమాజంలో మనుషులు ఉత్తములుగా జీవించాలని ఎంతటి పనినైనా బుద్ధిబలంతో పూర్తిచేయ్యాలని లక్ష్మణ కవి పేర్కొన్నారు.

**ముగింపు :** శతకాలు నైతిక, మానవీయ జీవన సూత్రాలను, సామాజిక అంశాలను తెలియజేస్తాయి. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దటంలో, మనుషుల్లో నైతిక విలువలను పెంపొందించడంలో శతకాలు కీలకపాత్ర పోషిస్తాయి.

**ఆధార గ్రంథాలు :**

1. సమతీ శతకం- బద్దెన, యన్ వి గోపాల్ & కో ప్రచురణ, మద్రాస్, 1915
2. వేమన శతకం - యోగి వేమన, రెడ్డి సేవాసమితి ప్రచురణ, కడప,2011
3. భాస్కర శతకం - మారద వెంకన్న, సత్యనారాయణ బుక్ డిపో, రాజమండ్రి, 1998
4. సుభాషిత రత్నావళి ఏనుగు లక్ష్మణ కవి, జె పి పబ్లికేషన్స్, విజయవాడ, 2011